క్లుప్తంగా

బీఆర్‌ఎస్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



రుద్రూర్: పోతంగల్ మండల పరిధిలోని హంగార్గ ఫారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త కాంబ్లె దిలీప్ కుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. దిలీప్‌కు బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున బాధిత కుటుంబ సభ్యులకు రూ. రెండు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. బీఆర్‌ఎస్ కోటగిరి ఉమ్మడి మండల అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్, చేతన్‌నగర్ మాజీ సర్పంచ్ గౌతమ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని బాలుర గురుకుల పాఠశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తారాసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ట్రాన్స్‌కో అధికారులకు అవార్డులు

నవీపేట: ఉత్తమ సేవలందించినందుకు నవీపేట ఏడీఈ సుహాసిని, ఏఈ ప్రవీణ్‌కుమార్‌కు శుక్రవారం అవార్డులు వరించాయి. ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ట్రాన్స్‌కోలో ఉత్తమ సేవలపై ఆరాతీశారు. నవీపేట ఏడీఈ సుహాసినికి ద్వితీయ స్థానం లభించగా, గ్రామీణ సెక్షన్ విభాగం ఏఈ ప్రవీణ్‌కుమార్‌కు జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు దక్కింది. అవార్డులు పొందిన ఉద్యోగులను నిజామాబాద్ డీఈఈ శ్రీనివాస్ అభినందించారు.

కొయ్యలకు నిప్పు పెట్టొద్దు

మోర్తాడ్: యాసంగిలో వరి కోతల అనంతరం కొయ్యలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని ఏర్గట్ల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ శుక్రవారం వెల్లడించారు. వరి కోతల తర్వాత మిగిలిన కొయ్యలను కాల్చి బూడిద చేస్తే ప్రయోజనం ఉండదని తెలిపారు. పొలంలో వరి కొయ్యలకు నిప్పు పెడితే భూమి విపరీతంగా వేడెక్కుతుందని ఫలితంగా భూసారం కోల్పోతుందని పేర్కొన్నారు. పంటలకు మేలు చేసే పురుగులు సైతం మరణిస్తాయని వివరించారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి



పెర్కిట్: లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పెర్కిట్ 7వ వార్డు పరిధిలోని తిరుమల కాలనీవాసులు ట్రాన్స్‌కో ఏఈ భాస్కర్ ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. కాలనీలో సింగిల్ ఫేస్ విద్యుత్ లైన్ త్రీ ఫేస్‌గా మారిస్తే సమస్య తీరుతుందని అన్నారు. ఏడీకి ప్రతిపాదలను పంపి సమస్య పరిష్కరిస్తామన్నారు. కాలనీవాసులు ఖాందేశ్ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

అందుబాటులో సోయా చిక్కుడు విత్తనాలు

రుద్రూర్: మండలంలోని ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రంలో సోయా చిక్కుడు–బాసర రకం విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి బాలాజీ నాయక్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బాసర రకం ఫౌండేషన్ 110 రోజుల కాల పరిమితి ఉంటుందన్నారు. ఆసక్తి గల రైతులు పరిశోధన స్థానంలో విత్తనాలు పొందాలని పేర్కొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి

బాల్కొండ: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ అన్నారు. శుక్రవారం మెండోరా మండల పరిధిలోని విత్తన, ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువుల పట్టికలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు రాజుకుమార్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

ఎడపల్లి: మండలంలోని సొసైటీ కార్యాలయంలో జీలుగ విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్ శుక్రవారం తెలిపారు. ఒక బ్యాగ్ ధర రూ. 2790 ఉండగా సబ్సిడీ పోను రూ.1116 చెల్లించాల్సి రైతులు ఉంటుందన్నారు. ఒక రైతుకు మూడు బ్యాగులే ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

లోలెవల్ వంతెనలతో ఇక్కట్లు

- వర్షం పడితే రాకపోకలు బంద్
- ఆర్మూర్, ఆలూర్ మండలాల్లో బ్రిడ్జిల దుస్థితి
- ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు



మిర్దాపల్లి నుంచి దేగాం వెళ్లే మార్గంలో వంతెనపై ప్రవహిస్తున్న వరద (ఫైల్)



మంథని నుంచి దేగాం వెళ్లే మార్గంలో ఉన్న లోలెవల్ వంతెన



గత ఏడాది కురిసిన వర్షాలకు బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద(ఫైల్)

పెర్కిట్: ఆర్మూర్, ఆలూర్ మండలాల్లోని లోలెవల్ వంతెనలతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే వరదతో వంతెనలు మునిగిపోయి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణం ప్రాణ సంకటంగా మారుతోంది. పరిస్థితి తీవ్రంగా ఉన్నా పాలకులు పట్టించుకోక పోవడంపై ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్మూర్ మండలం మంథని నుంచి ఆలూర్ మండలం దేగాం వెళ్లే మార్గంలో పోచమ్మ గుడి ప్రాంతం వద్ద ఉన్న వంతెన పూర్తిగా లోతట్టుగా మారింది. అలాగే శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో ఆలూర్ మండలం గుత్ప ఎత్తిపోతల పథకం చెరువు నిండి వరద వాగు ద్వారా ఆలూర్, మిర్దాపల్లి, మంథని, దేగాం గ్రామాల మీదుగా ప్రవహించి శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌లో కలుస్తోంది. ఒక్కోసారి ప్రవాహం ఉధృతంగా మారి బ్రిడ్జిలపై నీరు ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల వద్ద గతంలో ఏర్పాటు చేసిన లోలెవల్ బ్రిడ్జిలు సైతం శిథిలావస్థకు చేరాయి. దేగాం గ్రామస్తులు ఆర్మూర్ చేరుకోవడానికి ఆలూర్ మీదుగా తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే మిర్దాపల్లి గ్రామస్తులు దేగాం వెళ్లే వీలు లేకుండా పోతోంది. ఏడాదిన్నర క్రితం లోలెవల్ వంతెనల స్థానంలో నూతన బ్రిడ్జిలు నిర్మించడానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు సర్వే చేపట్టారు. ఆర్మూర్ పట్టణంలోని సుభాష్‌నగర్ వద్ద, మండలంలోని పిప్రి నుంచి మంథని వెళ్లే మార్గంలో నూతన బ్రిడ్జిలు నిర్మించారు. కానీ అంచనా వ్యయాలు ఎక్కువ అవుతున్నాయని మిర్దాపల్లి, దేగాం వద్ద నూతన బ్రిడ్జిల నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రెండు గ్రామాల ప్రజలకు లోలెవల్ వంతెనలు సమస్యగా మారాయి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మిర్దాపల్లి, దేగాం గ్రామాల వద్ద నూతన వంతెనలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అనిల్‌కుమార్‌కు సీఎం అభినందన



అనిల్ కుమార్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

బోధన్: సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన ఎస్‌ఎస్‌యూఐ, సోషల్ మీడియా అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అనిల్ కుమార్‌ను హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి గురువారం అభినందించారు. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో రాష్ట్రస్థాయి పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ కో–ఆర్డినేటర్లతో హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న తనను సీఎం అభినందించినట్లు శుక్రవారం తెలిపారు. మారు మూలగ్రామానికి చెందిన తనను గుర్తించి, సీఎంతో కలిసి వేదికను పంచుకునే అవకాశం లభించడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశం దక్కేందుకు సహకరించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ సతీశ్, మీడియా కమ్యూనికేషన్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి రాంమోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్



పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఆర్మూర్: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్ సూచించారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా సిబ్బంది పట్టణంలోని రాంనగర్, జర్నలిస్టు కాలనీ, కమలానెహ్రూ కాలనీ, పోచమ్మ గల్లీలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో మంచి నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవని కాలనీవాసులకు సూచించారు. అనంతరం కాలనీల్లోని ఇళ్ల పరిసరాల్లోని కుండీల్లో నిలువ ఉన్న నీటిని తొలగించారు. వైద్య సిబ్బంది సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్ బట్టు, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతితో చదువును ఆపొద్దు



ఆర్మూర్: పదో తరగతితో బాలికలు చదువును ఆపొద్దని పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల అధ్యాపకురాలు ప్రిన్సిపాల్ కనక మహాలక్ష్మి సూచించారు. ఉన్నత చదువుతోనే బాలికలు సమాజంలో సమోన్నత స్థానాన్ని పొందగలరన్నారు. ప్రిన్సిపాల్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ దేవరాం, అధ్యాపకులు పట్టణంలోని విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఇంటర్‌లో అడ్మిషన్ తీసుకోవాలని పదో తరగతి పాసైన విద్యార్థులను కోరారు. అదేవిధంగా ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులను ఈ నెల 24 నుంచి నిర్వహించే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల కోసం నిర్వహించే స్పెషల్ క్లాసులకు హాజరు కావాలని సూచించారు. అధ్యాపకులు వెంకటేశ్, నవీన్, సవిత ఉన్నారు.

ఓటర్లను ప్రలోభపెట్టారనే..



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

ఆర్మూర్: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహిస్తున్న మెప్మా ఆర్పీ గంగామణి ఓటర్లను కాంగ్రెస్‌కు ఓటేయాలని ప్రలోభపెట్టడాన్ని గమనించిన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోమన్నారని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అప్పటికే 54వ పోలింగ్ బూత్‌లోని ఏజెంట్లు ఆమెపై మున్సిపల్ కమిషనర్ రాజుకు, ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఆమెతో పాటు ఇతర పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహిస్తున్న ఆర్పీలను పోలింగ్ బూత్ నుంచి వెళ్లిపోవాలని కమిషనర్ సూచించినా ఆమె వెళ్లలేదన్నారు. కానీ ఆర్పీ గంగామణి ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి తనపై ఆగ్రహం వ్యక్తం చేశారంటూ వక్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేసిందన్నారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టి ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, సాంబడి కుమార్, సాయినాథ్ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కమలాపురం రాజన్న

ఆర్మూర్: పట్టణంలో నిర్వహించే దళిత హక్కుల పోరాట సమితి జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కమలాపురం రాజన్న కోరారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం దళితుల ఓట్ల కోసం ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అడుగడుగునా దళితులను మోసం చేస్తోందని ఆరోపించారు. ఆర్మూర్ డివిజన్ కన్వీనర్ మాదరి నరేశ్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల అమలుకు నోచుకోక, దళితులకు సరైన ఉపాధి లేక విదేశీలకు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులను ఏకం చేయడానికి ఈ నెల 26న నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేకల సాయిలు, శ్రీను, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ జాతీయ స్థాయి క్యాంపులో క్షత్రియ విద్యార్థి



సాయి స్వాగత్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

పెర్కిట్: ఆర్మూర్ మండలం క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థి కర్ణం సాయి స్వాగత్ జాతీయ స్థాయి శిబిరంలో పాల్గొన్నట్లు కళాశాల యాజమాన్యం శుక్రవారం తెలిపింది. సాయి స్వాగత్ గత నెలలో నిర్వహించిన బెటాలియన్ లెవెల్, గ్రూప్ లెవెల్ ఫైరింగ్ కాంపిటేషన్‌లో పాల్గొని కాకినాడలోని పెద్దాపురం నవోదయ పాఠశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి ఎంపికయ్యాడు. శిబిరంలో పది రోజుల పాటు శిక్షణ పొంది శుక్రవారం కళాశాలకు చేరుకున్నారు. దీంతో విద్యార్థిని కళాశాల యాజమాన్యం సభ్యులు అభినందించారు.

సునీల్‌కుమార్‌కు సన్మానం



సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న సభ్యులు

మోర్తాడ్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డిని మోర్తాడ్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం కలిసి సన్మానించారు. గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని కోరారు. స్పందించిన సునీల్‌రెడ్డి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు జక్కం అశోక్, నూతుల రాజేందర్, దడివె అశోక్, కడపటి రాజేశ్వర్, పుప్పాల రాజ్ విఠల్, హరీశ్‌గౌడ్, అక్కల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఆశా వర్కర్ సునీత

బోధన్: సాలూర మండల కేంద్రానికి చెందిన ఆశా వర్కర్ గాండ్ల సునీత తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తన భర్త మృతి చెందిన అనంతరం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనను నమ్మించి మూడేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడని నాటి నుంచి హింసిస్తున్నాడని, అతని నుంచి ప్రాణహాని ఉందన్నారు. గతంలో పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

తరగతులు పునఃప్రారంభమయ్యేనా..?

- ప్రభుత్వ కళాశాలలో ఇంకా ప్రారంభం కాని అడ్మిషన్లు
- ఇంటర్ అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందుల్లో విద్యార్థులు



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఈ ఏడాది తరగతులు పునఃప్రారంభమవుతాయో లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదో తరగతి ఫలితాలు వెలువడి రెండు వారాలు గడిచినా కళాశాలలో నేటికీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టలేదు. ఈ నెల 9 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, 31 ఆఖరు గడువుగా ఉంది. జూన్ 1 నుంచి జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కళాశాలలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించకపోవడంతో ఈ ఏడాది కళాశాల ఇక్కడ ఉంటుందో లేదా ఎక్కడికైనా తరలిస్తారేమోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది జూనియర్ కళాశాల మంజూరు

కమ్మర్‌పల్లి మండల కేంద్రం జిల్లా సరిహద్దులో ఉండడం, గ్రామీణ ప్రాంతం కావడంతో విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుందనే ఉద్దేశంతో నాటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కళాశాలను మంజూరు చేయించారు. గతేదాది ఆగస్టు 18న కళాశాల మంజూరు కాగా, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని భవనంలో కళాశాల ప్రారంభించాలని నిర్ణయించారు. 28న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవితతో కలిసి ప్రారంభించారు. భీమ్‌గల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. కానీ సిబ్బందిని నియమించలేదు.

సిబ్బంది నియామకాలేవీ..?

కళాశాల ప్రారంభమై రెండేళ్లవుతున్నా ఇంకా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తోనే కొనసాగుతోంది. సదరు ప్రిన్సిపాల్‌కు భీమ్‌గల్ కళాశాల బాధ్యతలు ఉండడంతో కమ్మర్‌పల్లికి పూర్తి సమయం కేటాయించడం లేదు. మేనేజ్‌మెంట్ కోసం సిబ్బందిని ఎవరిని నియమించలేదు. కనీసం విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడానికి అధ్యాపకులు లేరు. అటెండర్‌నైనా నియమించలేదు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి సదుపాయాలు కల్పిస్తూ కళాశాలను ఉన్నతస్థితిలోకి తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీలతో..

కళాశాల ప్రారంభమైనప్పుడు 19 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులకు జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి గెస్ట్ లెక్చరర్లను రప్పించి పాఠ్యాంశాలు బోధింపజేశారు. ఇటీవల వెలువడిన పరీక్షా ఫలితాల్లో ఎవరు ఉత్తీర్ణులు కాలేదు. కళాశాల పునఃప్రారంభ నేపథ్యంలో ఈ ఏడాది కళాశాలలో అడ్మిషన్లకు సంబంధించి ఇంటర్ విద్యాశాఖ అధికారులు ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టలేదు. అదేవిధంగా సెకండియర్ తరగతులకు సంబంధించి ఎలాంటి ప్రక్రియ మొదలు కాలేదు.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కళాశాలలో నెలకొన్న సమస్యలను ఇంటర్ విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గెస్ట్ లెక్చరర్లను అలాట్‌మెంట్ చేస్తామని చెప్పారు. అటెండర్‌ను కేటాయించాలని కోరాం.

– చిరంజీవి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, కమ్మర్‌పల్లి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నందిపేట్: నందిపేట, మాక్లూర్ మండలాలతో పాటు జన్నేపెల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ అశోక్ శుక్రవారం తెలిపారు. నందిపేటలోని 132/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గ్రహించి సహకరించాలని కోరారు.

సీఎస్‌ఐ చర్చిలో వీబీఎస్



బోధన్‌టౌన్: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో వెకేషన్ బైబిల్ స్కూల్(వీబీఎస్) కార్యక్రమాన్ని పాస్టర్ ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు సాగుతుందని, ఇందులో పిల్లలకు యేసు క్రీస్తు చేసిన బోధనలు, బైబిల్ సూక్తులను ఫాదర్లు వివరిస్తారని పేర్కొన్నారు. పాస్టర్లు, స్కూల్ టీచర్ జ్యోత్స్న, కమిటీ సభ్యులు జ్యోతిరాజ్, ఎడ్వర్డ్ ముల్లర్, అనిల్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లాల్ చెరువులో 8.5 ఫీట్ల నీరు

బోధన్‌టౌన్: పట్టణ ప్రజల ప్రధాన తాగునీటి వనరు అయిన బెల్లాల్ చెరువులో 8.5 ఫీట్ల నీరు ఉంది. ఈ చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం 12 ఫీట్లు కాగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి 7 ఫీట్ల ఉన్న నీటిని నిజాంసాగర్ నీటిని విడుదల చేయించడంతో 8.5 ఫీట్లకు చేరింది. దీంతో చెరువులో ఉన్న నీరు జూన్ 20 వరకు వస్తాయని, తాగునీటికి ఇబ్బంది ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. ఎండలు తీవ్రంగా ఉంటే మాత్రం చెరువులో ఉన్న నీరు సరిపోదు. ప్రతీ రోజు పట్టణ ప్రజలకు 23 లక్ష ల గ్యాలన్ల నీటిని తాగునీటి కోసం ఉపయోగిస్తు న్నారు. తాగు నీటి వృథాను అరికట్టేందుకు ఇప్పటికే పట్టణంలోని పైప్‌లైన్ లీకేజీలను అధికారులు గుర్తించి మరమ్మత్తులు చేశారు. ప్రజలు నీటి వృథాను అరికట్టాలని అధికారులు కోరుతున్నారు.



బోధన్‌లోని బెల్లాల్ చెరువు

లిఫ్టుల కమిటీ అధ్యక్షుడిగా భోజారెడ్డి



డొంకేశ్వర్: డొంకేశ్వర్, నందిపేట్ మండలాల లిఫ్టుల కమిటీ అధ్యక్షుడిగా మారంపల్లి ఎత్తిపోతల చైర్మన్ మోర్తాడ్ భోజారెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం నూత్‌పల్లిలో ఎన్నికలు నిర్వహించారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా దత్తాపూర్ లిఫ్ట్ చైర్మన్ సుంకరి రాజు, కార్యదర్శిగా సీహెచ్ కొండూర్ లిఫ్ట్ చైర్మన్ ఓంకార్, సభ్యులుగా వివిధ లిఫ్టు చైర్మన్లు రమేశ్ రెడ్డి, జిలకరి చిన్నయ్య, గంగారెడ్డి, రాజేశ్వర్, చిన్నారెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని సభ్యులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్‌లో ఉన్న శ్రీపద్మావతి వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని శనివారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ తిగుళ్ల గంగామణి రాజవరప్రసాద్ శుక్రవారం తెలిపారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.